క్లుప్తంగా

అసిస్టెంట్ కలెక్టర్ పరిశీలన

కర్నూలు(సెంట్రల్): జిల్లా రిజిస్టర్ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ చెల్లా కళ్యాణి సందర్శించారు. మంగళవారం ఆమె క్యార్యాలయాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్ విధానంపై అవగాహన పెంచుకున్నారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన డాక్యుమెంట్లు, వినియోగించే సాఫ్ట్‌వేర్, ఇతర వివరాల పై రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 29, 30 తేదీల్లో ఎమ్మిగనూరులో జరిగే సీపీఎం 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ న్యూసిటీ కమిటీ ఆల్ యూనియన్స్ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నగర అధ్యక్షుడు ఆర్.నరసింహుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం జిల్లా మహాసభలకు కార్మికులు వేలాదిగా తరలి రావాలన్నారు. నాయకులు సాయిబాబా, టి.రాముడు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు ఎంపిక



జాతీయ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులు

కర్నూలు (టౌన్): బీహార్ రాష్ట్రంలోని పాట్నా నగరంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న 68వ జాతీయస్థాయి అండర్–19 అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను డీవీఈఓ పరమేశ్వర రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి హర్షవర్ధన్ అభినందించారు. జాతీయ పోటీలకు సాంఘిక సంక్షేమ శాఖ, కస్తూర్బా స్కూళ్ల నుంచి క్రీడాకారులు జ్యోతి, ఎలిషా, పవిత్ర, లోకేష్, సుమన్, విజయ్ ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని చెప్పారు.

షూటింగ్ బాల్‌లో సత్తా చాటాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన పరశురాముడు

కర్నూలు (టౌన్): పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హౌరా పట్టణంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్న 43వ జాతీయస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా చాటాలని రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు స్పష్టం చేశారు. మంగళవారం పశ్చిమబెంగాల్‌కు బయలుదేరుతున్న క్రీడాకారులకు ఆయన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. బాలుర జట్టులో జయంత్, కిరణ్, స్వరూప్, జయన్న, పవన్ తేజ, చరణ్, కార్తీక్, మౌళి, నిహాల్ నారయణలాల్ బాలికల జట్టులో అనూష, అనుశ్రీ, నదియా, ధనిక, రమ్యశ్రీ, పూజశ్రీ, చంద్రిక, పావని, రహీమానియా, నందిని, కావ్య, విష్ణుప్రియ ఉన్నారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను దేశ ప్రజలు క్షమించరన్నారు. ఆయన్ను మంత్రి వర్గం నుంచి తొలగించే వరకు పోరాటం ఆపమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి దేశ నాయకులంటే గౌరవం లేకుండా పోయిందని, నిత్యం వారిని అవమాన పరుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బజారన్న, అనంతరత్నం మాదిగ, షేక్ మాలిక్, సయ్యద్ నవీద్, డీవీ సాంబశివుడు, ప్రమీళ పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ విపత్తు సంభవించినప్పుడు ఏర్పడే విత్కర పరిస్థితులలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ కర్నూలు కేంద్ర అధికారి చిన్న బజారప్ప, ఇతర శాఖల అధికారులు మంగళవారం ఉదయం కర్నూలు శివారులోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఎల్‌పీజీ ప్లాంట్‌లో గ్యాస్ లీక్ మాక్ డ్రిల్ నిర్వహించారు. సాయంత్రం గొందిపర్ల గ్రామంలోని టీజీవీ ఎస్ఆర్ఏసీ లిమిటెడ్ ఫ్యాక్టరీలో క్లోరిన్ గ్యాస్ లీక్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాకశాఖ కర్నూలు కేంద్ర అధికారి చిన్న బజారప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విపత్కర పరిస్థితులపై అవగాహన కలిగి ఉండడం అవసమన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాల అలంకరణలో రాక్ వుడ్‌చర్చి



పునీత థెరేసమ్మ చర్చి



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలకు సిద్ధంగా..



కోల్స్ చర్చి

లోక రక్షకుడి జననం.. జగమంతా పావనం

- నేడు క్రిస్మస్ పర్వదినం
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: నగరంలోని చర్చిల్లో క్రిస్మస్ పండుగ స్వాగత గీతాలు వినిపిస్తున్నాయి. క్రైస్తవ కుటుంబాల్లో పండుగ సన్నాహాలు కనిపిస్తున్నాయి. సీసీఎస్ చర్చి, సీఎస్ఐ, లూర్థు మాత మందిరం, బీక్యాంప్ ప్రార్థనా మందిరం, స్టాంటన్ తెలుగు బాప్టిస్ట్ చర్చి, హోసన్నా మందిరం, ఎరుసలేం చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో క్రిస్మస్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్నూలు నగర పాలక కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాజ్‌విహార్ సెంటర్, రైల్వేస్టేషన్ సర్కిల్, కిడ్స్ వరల్డ్, కొండారెడ్డి బురుజు సమీపంలోని సర్కిళ్లలో క్రిస్మస్ స్టార్స్, విద్యుత్ బల్బులతో అలంకరణలు చేశారు. దుకాణాలలో రంగురంగుల క్రిస్మస్ స్టార్స్, క్రిస్మస్ ట్రీస్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. క్రిస్మస్ తాతల బొమ్మలు రకరకాల రంగుల్లో ఆకర్షణీయంగా కొనుగోలుదారులను ఆహ్వానిస్తున్నాయి. క్రిస్మస్ సందర్భంగా ఇంటిపైన దర్శనమిచ్చే నక్షత్రాలు పలురకాల సైజుల్లో దుకాణాల్లో వేలాడుతున్నాయి. ఇళ్లల్లో గోడలకు, గుమ్మాలకు వేలాడ దీసే విద్యుత్తు బల్బులు, తోరణాల అమ్మకాలు జోరుగా జరిగాయి.

ప్రత్యేక ఆకర్షణగా అలంకరణలు

నగరంలోని పాత బస్టాండ్, ఆర్ఎస్ రోడ్డు, మద్దూర్ నగర్, సీ క్యాంపు సెంటర్, వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాలలో దుకాణాల వద్ద క్రైస్తవ కుటుంబాలు తమ చిన్నారులతో కలిసి స్టార్స్, క్రిస్మస్ ట్రీస్, హ్యాంగింగ్స్, డెకోరేటివ్ ఫ్లవర్స్ కొనుగోలు చేస్తున్నారు. క్రిస్మస్ పండుగను స్వాగతిస్తూ పలుచోట్ల జరిగే క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కోసం ముందుగానే సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఒకప్పుడు కేవలం స్టార్స్ మాత్రమే కొనుగోలు చేసేవారు. కాలక్రమేణా అలంకరణలలో కొత్తకొత్తగా వస్తువులు రావడంతో చిన్నారులు, పెద్దలు వాటిని కొనుగోలు చేసి ఇంట్లో క్రిస్మస్ అలంకరణ చేసుకొని మురిసిపోతున్నారు. ముఖ్యంగా రంగురంగుల కాగితాలతో చేసిన రూఫ్ డెకరేషన్స్, క్రిస్మస్ బెల్స్, గుమ్మాల తోరణాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. థర్మాకోల్‌తో తయారైన పుశువుల పాకలో బాలయేసు జననం, క్రీస్తు ఆశీస్సులందించే దృశ్యాలు కొనుగోలుదార్లను ఎక్కువగా ఆకట్టుకున్నాయి. మొత్తంగా ఈ అలంకరణ సామగ్రితో నగరం నిండా క్రిస్మస్ పండగ వాతావరణం చోటుచేసుకుంది.



సీఎస్ఐ చర్చి



బిషప్స్ చర్చిలో క్రీస్తు జననం తెలిపే బొమ్మల కొలువు

క్రీస్తు జననం సమస్త జనులకు మహోపకారం



యేసుక్రీస్తు జననం సమస్త మానవాళికి మహోపకారం. ఆదరణ, ఆనందం, ఆశీర్వాదాలను పరలోకం నుంచి మన కోసం తీసుకొచ్చిన జీసస్ జననాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ క్రిస్మస్ పర్వదినాన్ని జరుపుకుంటున్నాం. దేవుడి కుమారునిగా యేసుక్రీస్తు ఈ లోకంలో జన్మించి రక్షకుడుగా, ప్రభువుగా మనలను పాపం నుంచి, శాపం నుంచి కాపాడి శాంతి ప్రసాదించారు. సమస్త ప్రజలందరూ ఆయన వెలుగులో, రక్షణలో క్షేమంగా సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ క్రిస్మస్, నూతన సంవత్సర శుభ దీవెనలు.

– రెవ.జీవన్ రావ్, పాస్టర్, కోల్స్ చర్చి, కర్నూలు

లోక రక్షకుడు ఉదయించిన వేళ



దైవ కుమారుడు నరుడిగా దిగివచ్చిన వేళ, ప్రభువు రాకను ప్రకటించిన తార (స్టార్) అంబరాన మెరసి మురిసిన వేళ, దీనులు, ఘనులు తారతమ్యం లేకుండా క్రీస్తు పవిత్ర నామంను కొనియాడి ఆడిపాడే దినం, శాంతి, సమాధానానికి చిహ్నం క్రిస్మస్ పర్వదినం. సర్వలోక పాప పరిహారార్థం కల్వరి సిలువలో బలిగా తన దివ్య రక్తాన్ని చిందించి, రక్షణ, నిరీక్షణ మనకు అనుగ్రహించుటకే ఈ లోకానికి వచ్చాడు ఏసుప్రభు. క్రిస్మస్ పర్వదినాన ప్రజలు తమ గృహాల్లో క్రిస్మస్ చెట్లను అలంకరించినట్లే తమ హృదయాలను ప్రభువుకు సమర్పించి, మంచితనం, కరుణ, ప్రేమతో అలంకరించుకోవాలని దేవుని సంకల్పం. అదే నిజమైన క్రిస్మస్‌గా నిలుస్తుంది.

– రెవ. ఎమ్.పాల్ అగస్టీన్, ఇమ్మానుయేల్ చర్చి, కర్నూలు



ప్రార్థనా మందిరం



బిషప్ చర్చి



క్రీస్తు జననాన్ని తెలిపే బొమ్మల కొలువు

క్రిస్మస్ సందడి

కర్నూలు సిటీ: స్థానిక మాధవీనగర్‌లోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏజీఎం సురేష్‌కుమార్, మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో యునైటెడ్ క్రిస్టియన్ మినిస్ట్రీ సెక్రటరీ ఎం.సుధీకర్ క్రిస్మస్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. క్రీస్తు జననాన్ని వివరిస్తూ చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు, శాంటాక్లాస్ వేషధారణ అందరినీ ఆకట్టుకుంది.

కర్నూలు(సెంట్రల్): క్రీస్తు జననం అపూర్వమైనది, మానవాళికి ప్రేమ, అప్యాయత, శాంతిని కలుగజేశారని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మాజీఎమ్మెల్సీ సుధాకరబాబు, పాస్టర్ రెవరెండ్ జీవన్ పాల్గొని కేకును కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు.

కర్నూలు(హాస్పిటల్): ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. స్థానిక శ్రీనివాసనగర్‌లోని స్టాంటన్ బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఏసుప్రభువు ప్రజల పాపాలను తొలగించేందుకు ఈ భూమి మీదకు వచ్చారని వివరించారు.

కర్నూలు (టౌన్): క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని వీకర్ సెక్షన్ కాలనీలోని లెప్రసీ బాధిత కుటుంబాల వారికి నూతన వస్త్రాలను అందజేశారు. మంగళవారం స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో మాజీ యూత్ డైరెక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఫర్ అదర్స్ కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ జీవన్ రావు దైవ సందేశం వినిపించారు. న్యూ ఇయర్ కమిటీ చైర్మన్ ముత్యాల భాస్కర్‌రావు, రూఫస్ రెనాల్డ్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



పాస్టర్‌కు కేక్ తినిపిస్తున్న డాక్టర్ శంకరశర్మ



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న పాస్టర్లు, కమిటీ సభ్యులు

చిరు వ్యాపారులను ఆదుకోవాలి



మునిసిపల్ అదనపు కమిషన్ ఆర్జీవీ కృష్ణతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద 30 ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని వెళ్లిపోవాలని మునిసిపల్ అధికారులు ఆదేశించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, రోడ్ సైడ్ వ్యాపారుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఎం.మహ్మద్‌రఫీ, ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య పేర్కొన్నారు. వారు మంగళవారం ఫ్లైవర్ బ్రిడ్జి కింద చిరు వ్యాపారులను కలుసుకున్న సమయంలో మునిసిపల్ అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ రావడంతో ఆయనకు సమస్యలను వివరించారు. ఈ ప్రాంతాన్ని ఒక గుత్తేదారుడికి లీజుకు ఇవ్వడంతో ఒక్కో వ్యాపారి నుంచి రోజుకు రూ.250 డిమాండ్ చేస్తున్నారని, ఆయన నుంచి వ్యాపారులకు రక్షణ కల్పించాలన్నారు. 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి రోడ్ సైడ్ వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మునిసిపల్ అధికారులపై ఉందన్నారు.

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి



మార్చురీ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థి రామప్రసాద్ రెడ్డి మృతికి కారణమైన కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీలో రామప్రసాద్ రెడ్డి మృతదేహాన్ని వారు పరిశీలించారు. మార్చురీ వద్ద ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. విద్యార్థి తండ్రికి నలుగురు కూతుళ్లు, రామప్రసాద్‌రెడ్డి ఒక్కడే కుమారుడు కాగా విద్యావంతుడై కుటుంబానికి అండగా ఉంటాడనుకుంటే కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా శవమై వచ్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, పీఎస్ఎన్ జిల్లా కన్వీనర్ అమర్, నాయకులు హర్ష మనోహర్, చింటూ, శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుసేన్ బాషా పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు వీకర్ సెక్షన్ కాలనీ, బాపూజీ నగర్‌కు చెందిన దళితురాలు పెంచలమ్మ ఇంటిని ఆక్రమించిన దౌలత్‌బీ, రసూల్ మియ్యాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘం నాయకులు జయన్న, సుమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట పెంచలమ్మతో కలసి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పెంచలమ్మ ఇంటి ఆక్రమణపై ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కల్లూరు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై నాలు గోపట్టణ పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

పోరాట యోధుడు పెరియార్



పెరియార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): ఆత్మగౌరవ పోరాట యోధుడు పెరియార్ రామస్వామి అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక వేదిక కార్యాలయంలో పెరియార్ 51వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మహిళా నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మాట్లాడుతూ పెరియార్ నాస్తిక వాది, సంఘ సంస్కర్త అని తమిళనాడులో ఆత్మగౌరవం ఉద్యమం, ద్రవిడ ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. సాంఘిక సామాజిక సమానత్వం కోసం, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహించారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళదామని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ, ఉపాధ్యక్షురాలు హుసేన్‌బీ, లక్ష్మేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించనందుకే అనుమతి రద్దు

కర్నూలు (టౌన్): నగరంలోని యస్.వి.ఆర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు స్టేడియం నిర్వహణకు ఫీజు చెల్లించనందుకే అనుమతి ఇవ్వలేదని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న కొందరు నిరుద్యోగులు స్టేడియంలో ఆందోళన చేశారని తెలిపారు. కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పోలీసు ఉద్యోగాల శిక్షణ కోసం రూ.12 వేల నుంచి రూ.14 వేలు ఫీజు వసూలు చేస్తున్నారని, వారికి శిక్షణ కోసం స్టేడియంలో సంప్రదించారని తెలిపారు. ఎన్నిసార్లు చెప్పినా స్టేడియంకు చెల్లించాల్సిన ఫీజు రూ.5 వేలు చెల్లించకపోవడంతో అనుమతి రద్దు చేసినట్లు వెల్లడించారు.

నేడు హరినామ జప యజ్ఞం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక పూరి జగన్నాథ మందిరంలో సమస్త ప్రజల సుఖ శాంతుల కోసం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హరినామ జప యజ్ఞం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక్ ప్రభు తెలిపారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు హాజరు కావాలని కోరారు.

నోటి శుభ్రతతో ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): రోజుకు రెండుసార్లు పళ్లను బ్రష్ చేసుకోవాలని, నోటి శుభ్రతలో ఆరోగ్యం ఉందని దంత వైద్యులు డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి చెప్పారు. జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎ.క్యాంపులోని ఇందిరాగాంధీ స్మారక నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి బ్రష్‌లు, టూత్‌పేస్టులు పంపిణీ చేశారు. నోరు శుభ్రంగా ఉంటే 60 శాతం వ్యాధులు దూరమవుతాయని వివరించారు.

గొర్రెల యజమానులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లి నగర పంచాయతీ సమీపంలోని నారాయణపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 200 గొర్రెలు, మేకలు చనిపోవడం బాధాకరమని, బాధిత యజమానులకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిన రోడ్డు ప్రమాదంతో గొర్రెల యజమానులకు రెండు కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కళలు సామాజిక చైతన్య రూపకాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



పాల్గొన్న కళాకారులు

కర్నూలు కల్చరల్: కళలు సామాజిక చైతన్య రూపకాలని విశ్రాంత కార్డియాలజీ వైద్యులు, ప్రభుత్వ ఆస్పత్రి పూర్వపు సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సూర్య కళా కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏ క్యాంప్‌లోని హార్ట్ ఫౌండేషన్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జానపద సంగీత నృత్యోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వీరు జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు కళలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సంగీతం, నృత్యంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. సూర్య కళా కల్చరల్ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు సోమశంకరయ్య, పద్మావతి, మృదంగం గురువు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మకు పూజలు



కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు సమిపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరెలు,గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

ఏపీ ఎంఈఐయూ వ్యవస్థాపక దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 72వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హాస్పిటల్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల న్యాయమైన కోరికలు, సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తెస్తే తప్పకుండా పరిష్కరిస్తానని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు మునెప్ప, ఆ శాఖ అధ్యక్షుడు బాలు నాయక్ మాట్లాడారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, నాగరాజు, శాఖ కార్యదర్శి ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న పి.రామంచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు పి.రామచంద్రయ్య శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ సమైక్యత, సమగ్రత కోసం 1925లో సీపీఐ ఆవిర్భావించినట్లు చెప్పారు. వచ్చే ఏడాదికి వందేళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా ఏడాది పాటు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రతి ఊరువాడల్లో ఉత్సవాలు నిర్వహించాలని, వందేళ్లలో చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నాయకులు ఆవుల శేఖర్, మునెప్ప, జగన్నాథం, పంపన్నగౌడ్, లలితమ్మ, భాస్కర్ యాదవ్, బి.కృష్ణ,చంద్రశేఖర్, విరుపాక్షి, రంగన్న, కారుమంచి, శ్రీరాములు గౌడ్ పాల్గొన్నారు.